నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 21 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

అమరచింతలో బహిరంగసభ నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న రజినీసాయిచంద్

29న సాయిచంద్ కాంస్య విగ్రహావిష్కరణ

- అమరచింతలో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న కేటీఆర్, హరీశ్‌రావు
- గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్

అమరచింత, జూన్ 20 : మలిదశ తెలంగాణ ఉద్యమ కళాకారుడు, అమరచింత ముద్దుబిడ్డ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ దివంగత సాయిచంద్‌రెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఈ నెల 29న విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ తెలిపారు. శుక్రవారం ఆమె బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగభూషణంగౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లెనిన్, సాయిచంద్ అభిమానులతో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బహిరంగసభకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రజినీసాయిచంద్ విలేకరులతో మాట్లాడుతూ సాయిచంద్ రూపం ఉట్టిపడేలా, ఆయన అభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయేలా అమరచింత ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రధాన రహదారిపై ఏడడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగసభను ఉమ్మడి జిల్లాకు చెందిన కళాకారులు, సాయిచంద్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఆమె వెంట సాయిచంద్ అభిమానులు ఉన్నారు.

రైతులకు సంకేళ్లు వేయడం దురదృష్టకరం

- అలంపూర్ ఘటనపై పోలీసు అధికారుల నిర్లక్ష్యం
- ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటివి పునరావృతం కావు
- మీడియాతో మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్, జూన్ 20 : ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ఇటీవల అరెస్టు అయ్యి జైలుకు వెళ్లిన రైతులను అలంపూర్ కోర్టుకు తీసుకెళ్లే క్రమంలో సంకెళ్లు వేసిన ఘటన చాలా దురదృష్టకరం అని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కానివ్వమని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఆయన జోగుళాంబ జోన్ పరిధిలోని ఉమ్మడి జిల్లాల ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీల ఎస్కార్ట్ విధుల్లో నిర్వహణ, భద్రతా చర్యలు జైలు, కోర్టుల మధ్య సమన్వయం, అనుమానాస్పద కార్యకలాపాల పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఐజీ విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ భారతీయ న్యాయస్థానం ప్రకారం ఖైదీల ఎస్కార్టులు, శిక్ష పడిన నేరస్తులు వారు దవాఖానకు వెళ్లేటప్పుడు కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయని జైలు అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్పీలకు సమాచారం వస్తుందని, నేరస్తుని ప్రవర్తనలో, పాత నేరస్తుడు అనే విషయంలో సమాచారం పొందుపరుస్తూ ఎటువంటి సమన్వయం లోపం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అలంపూర్ కోర్టులో, సంగారెడ్డిలో జరిగినా ఘటనలు చాలా దురదృష్టకరమైన విషయాలు అని, ఇటువంటి సమన్వయ, సమాచారం లోపం లేకుండా ఉండేందుకు ఎస్పీ, జిల్లా స్థాయిలో ఎస్‌వోపీ తయారు చేయడం జరిగిందన్నారు. ఒకసారి రిమాండ్ చేసిన ఖైదీలను తర్వాత బెయిల్ కోసం, దవాఖానకు వెళ్లేటప్పుడు లా అండ్ ఆర్డర్ వారిపై నిఘా తక్కువ పెట్టడం జరుగుతుందనన్నారు. రైతులు, మహిళలు, మైనర్లు, వృద్ధులను తరలించే విషయంలో అవసరం మేరకు జాగ్రత్తలు తీసుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఒక వేళ ఎవరికైనా సంకెళ్లు వేయాల్సిన పరిస్థితి వస్తే న్యాయస్థానం అనుమతితో కానీ, బీఎన్ఎస్ 43 సెక్షన్ ప్రకారం జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అలంపూర్ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం, ఏదైనా జరిగితే ఎదో అవుతుందనే అభద్రత భావనతో పోలీసులు జాగ్రత్తలు పాటించి సస్పెండ్‌కు గురైనట్టు వివరించారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ డీ జానకి, నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్, వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస్‌రావు, నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతం తదితరులు పాల్గొన్నారు.

జూరాల 10 గేట్లు ఓపెన్

- ఇన్‌ఫ్లో 84,000 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 91,944 క్యూసెక్కులు

గద్వాల, జూన్ 20 : ఎగువన వర్షాలు భారీగా కురుస్తుండడంతో జూరాలకు వరద ఉధృతి కొనసాగుతున్నది. శుక్రవారం జూరాల ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి దిగువకు 58,722 క్యూసెక్కు నీటిని విడుదల చేస్తున్నారు. అల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాలకు 84,000 వేల క్యూసెక్కుల వదర నీరు వచ్చి చేరుతున్నది. జూరాలకు వరద కొనసాగుతుండగా విద్యుత్ ఉత్పత్తికి 31,852 క్యూసెక్కులు, భీమా-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 315, కుడి కాల్వకు 340 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 84000 క్యూసెక్కులు ఉండగా మొత్తం అవుట్ ఫ్లో 91,944గా నమోదైంది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7,681 టీఎంసీల నీరు నిలువ ఉన్నది.

అలంపూర్ చౌరస్తాలో సిబ్బంది లేక నిరుపయోగంగా మారిన వంద పడకల దవాఖాన

వైద్యం.. ధైన్యం

- అలంపూర్ చౌరస్తాలో రూ.27 కోట్లతో వంద పడకల వైద్యశాల
- రెండేండ్లుగా నిరుపయోగంగా..
- పాడైపోతున్న పరికరాలు
- రోగులకు తప్పని తిప్పలు
- కర్నూల్ దవాఖానలకు క్యూ
- పట్టించుకోని అధికారులు

అలంపూర్, జూన్ 20 : పేదలకు వైద్యం అందించాలన్న తలంపుతో సర్కారు దవాఖానలను నిర్మించినా ఆదరణ లేక నిరూపయోగంగా మారుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని రోగులకు మరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం వంద పడకల దవాఖానను నిర్మించింది. ఇతర రాష్ట్రాలపై ఆధారపడకుండా పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఆలోచనలతో రూ.27 కోట్లు ఖర్చు చేసి ఆగమేఘాల మీద హైవే-44ను అనుసరించి అలంపూర్ చౌరస్తాలో పెద్దాసుపత్రిని ఏర్పాటు చేసి ప్రారంభించింది. తర్వాత ఎన్నికలు రావడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇక్కడ వైద్య సేవలు అందించడంలో అధికార పార్టీ నాయకులు చిన్నచూపు చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైద్యశాల రెండేండ్లు కావస్తున్నా ఉపయోగంలోకి రాలేదు. ఇప్పటికే గోడ లు బీటలు వారగా.. దవాఖానలోని ఖరీదైన మెడికల్ పరికరాలు సైతం చోరీకి గురవుతున్నాయి. కొన్నింటిని జిల్లాలోని ఇతర దవాఖానకు తరలించారు. దీంతో నాటి పాలకులు చేసిన ఆలోచనకు కార్యరూపం దక్కడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన దవాఖానను ప్రారంభిస్తే క్రెడిట్ అంతా వారికే దక్కుతుందన్న అక్కసుతో అధికార పార్టీ ప్రారంభించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల బీజేపీ నేత రామచంద్రారెడ్డి వైద్యశాలను ఎందుకు ఉపయోగంలోకి తేవడం లేదని ప్రశ్ని స్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అందుకు స్పందించిన హైకోర్టు సంబంధిత శాఖకు అనుసంధానంగా ఉన్న శాఖలు, అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

పిల్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల దవాఖాన నిర్మించినా సిబ్బంది లేరంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులైన వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, మెడికల్ సైన్సెస్ ఇన్ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్, ప్రజారోగ్య శాఖ కమిషనర్, కలెక్టర్, వైద్యాధికారులు కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. నిర్మాణం జరిగి 18 నెలలైనా సిబ్బందిని నియమించకపోవడంతో పరికరాలు పాడవుతున్నాయని గద్వాలకు చెందిన సోషల్ వర్కర్ రామచంద్రారెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పూర్తి సమాచారంతో కౌంటర్ వేసేందుకు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరగా.. విచారణ జూలై 14కి వాయిదా పడింది.

ప్రభుత్వ నిర్ణయం.. మా చేతుల్లో ఏముంది

ప్రభుత్వ దవాఖాన ప్రారంభమనేది ప్రభుత్వ నిర్ణయం. మా చేతుల్లో ఏమీ లేదు.. వైద్యశాలలో రోగులకు పరిపడా పరికరాలు అన్నీ ఉన్నాయి. సిబ్బంది, వైద్యుల నియామకమే మిగిలింది. గత నెలలో కమిషనర్ విజయ్ కుమార్ అలంపూర్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం వంద పడకల దవాఖానకు 12 మంది స్టాఫ్ నర్సుల నియామకమైంది. పది మంది గద్వాల దవాఖానలో డిప్యూటేషన్‌పై, మరో ఆరుగురు విడుతల వారీగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

- సయ్యద్ బాషా, సూపరింటెండెంట్, అలంపూర్

ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం

అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన దవాఖానను ఉపయోగం లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను.. దవాఖానలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించండని, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, తాను కలిసి ఇప్పటికే ఐదారు పర్యాయాలు సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి, కమిషనర్‌కు వినతి పత్రాలు అందించాం. త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కృషి చేస్తున్నాం.

- విజయుడు, అలంపూర్ ఎమ్మెల్యే

'అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్నట్లు..

రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన దవాఖానలో వైద్య చికిత్సలకు అవసరమైన ఎక్విప్‌మెంట్ అందుబాటులో పెట్టుకుని వైద్యులను ఎందుకు నియమించడం లేదు. అన్ని సౌకర్యాలు ఉన్నా సొంత వైద్యం చేసుకోలేక పక్కనున్న ఏపీలోని కర్నూల్ దవాఖానలకు వెళ్లాల్సి వస్తుంది. లేదంటే గద్వాల, పాలమూరు జిల్లా వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా రాజకీయాలు పక్కన పెట్టి డాక్టర్లు, సిబ్బందిని నియమించి వైద్య సేవలు వెంటనే ప్రారంభించాలి. ఆ దిశగా ఆరోగ్య శాఖ మంత్రులు, కమిషనర్ ఆలోచించాలి.

- వెంకట్రామయ్యశెట్టి, అలంపూర్, జోగుళాంబ గద్వాల జిల్లా

ఎన్నికల సిబ్బందికే పనికొచ్చింది

రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వంద పడకల దవాఖాన లక్ష్యం నెరవేరలేదు. ఇంత వరకు రోగులకు కాకుండా దవాఖాన భవనం ఎన్నికల భద్రతా సిబ్బందికి మాత్రమే పనికొచ్చింది. భవనంలో ఉన్న సౌకర్యాలు (రోగుల కోసం ఏర్పాటు చేసిన కొత్త మంచాలు, పరుపులు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, అంతస్తు భవనం గదులు) ఎన్నికలొచ్చిన ప్రతిసారి విధులకు హాజరైన భద్రతా సిబ్బందికే ఉపయోగపడింది. మళ్లా ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో చేస్తున్నట్టుంది.దవాఖాన నిర్వహణకు వైద్యులను నియమించే ఆలోచన లేకపోతే ఆ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంగా మారిస్తే ఉపయోగపడుతున్నది. మండల కేంద్రంలో ఆయా శాఖల కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు.

- సంజీవ నాయుడు, అలంపూర్, జోగుళాంబ గద్వాల

పునరావాసం కల్పించాలి

- ప్రత్యామ్నాయం చూపకుండానే ఇండ్లు కూల్చడం దారుణం
- బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ఇల్లు కట్టుకుంటే ఒక్కొక్కరికీ రూ.2 లక్షల సాయమందిస్తాం
- మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్



ఇండ్ల బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్

చారకొండ, జూన్ 20 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో ఇండ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని, ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండానే కూల్చివేడంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సిరుసనగండ్ల (అయోధ్యనగర్)లో కూల్చిన ఇండ్లను పరిశీలించి, బాధితులతో సమావేశం నిర్వహించారు. తాము 50 ఏండ్లుగా ఇక్కడే ఉంటూ కాయకష్టం చేసి ఇండ్లు నిర్మించుకొని జీవనం గడుపుతున్నామని, ఒక్కసారిగా తెల్లవారు జామున పోలీసు బలగాలతో వచ్చి తమ ఇండ్లు కూల్చేశారని మాజీ ఎమ్మెల్యేల ఎదుట బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ న్యాయవ్యవస్థ, చట్టాలపై గౌరవం ఉందని, కానీ ప్రభుత్వం బాధితులకు పునరావాసం కల్పించిన తర్వాత కూల్చివేస్తే బాగుండేదన్నారు. ఈ ప్రాంత ముద్దబిడ్డ అని గొప్పలు చెపుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే హుటాహుటిన అధికారులను ఆదేశించి బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించే విధంగా ఆదేశించాలన్నారు. గూడు చెదిరి అమాయక ప్రజలు రోడ్డున పడి ఉంటే కనీసం పరామర్శిం చడానికి కూడా పాలకులకు సమయం లేదా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం మానవదృక్పథంతో ఆలోచించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఈలాంటి పరిస్థిలు మళ్లీ పునావృతం అయితే వేలాది మంది రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో 420 వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటలకు సిద్ధం అవుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు మళ్లీ నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు.

ఇండ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తాం

ఇండ్లు కోల్పోయిన బాధితులకు అన్ని విధాలుగా ఉండగా ఉంటూ వారు ఇండ్లు నిర్మించుకునేందుకు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్‌లు ఒక్కొకరూ ప్రతి బాధిత కుటుంబానికి రూ. లక్ష చొప్పున అందించి ఆదుకుంటామని భరోసా కల్పించారు. తక్షణ సాయంగా నిత్యావసర వస్తులకు రూ. 2లక్షలు బాధితులకు అందజేశారు. అదేవిధంగా సిరుసనగండ్ల బీఆర్ఎస్, మాజీ సర్పంచ్ యాతంశ్రీనివాస్ బాధితులకు తన సొంత భూమిల్లో ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలయ చైర్మన్, అర్చకుల దిష్టిబొమ్మల ఊరేగింపు, దహనం

తమ ఇండ్లు కూల్చివేడయంతో బాధితులు ఆగ్రహానికి గురై ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణ్‌శర్మతోపాటు మేనేజర్ నిరంజన్ దిష్టిబొమ్మలు తయారు చేసి ఫొటోలు పెట్టి ఊరేగింపు చేసి ప్రధాన రహదారిపై దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మసత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, యూత్ ప్రెసిడెంట్ చండీశ్వర్‌గౌడ్, నాయకులు సలీం, రామకృష్ణ, రమేశ్, కమలాకర్ రావు, సరిరాం, రాంలాల్, లక్ష్మణ్‌నాయక్, శ్రీశైలం, మోహన్‌రెడ్డి, అనిశెట్టిశ్రీను, పశులశ్రీను, మహేశ్, మధుగౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చిన ఇండ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, జైపాల్ యాదవ్, గువ్వల కాళ్లపై పడిన బాధితురాలు, అయోధ్యనగర్‌లో దిష్టిబొమ్మ దహనం

ఆరోగ్య యోగం

- యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం
- సాధనపై రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం
- పట్టణాల్లో వెలుస్తున్న శిక్షణా కేంద్రాలు

యోగా అంటే.. జీవనయోగం.. ప్రపంచం మొత్తం యోగా చుట్టూనే తిరుగుతున్నది. అమెరికాలాంటి దేశాలు సైతం యోగాలోని వైద్య గుణాలను ఆమోదిస్తున్నాయి. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతున్నది. అందుకే సాధనపై రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నది. మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తున్నది. అందుకే నేడు ఎక్కడ చూసినా శిక్షణా కేంద్రాలు వెలుస్తున్నాయి.

- మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 20

దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒడిదుకులు, ఒత్తిళ్ల కారణంగా ఏదో ఒక అనారోగ్య సమస్యల బారిన మనిషి పడుతుంటారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబకాయం, అస్తమా, నరాల బలహీనతవంటి సమస్య లు ఎదుర్కొంటున్నారు. దీంతో దవాఖానల చుట్టూ తిరుగుతూ వేల రూపాయాలు ఖర్చు చేస్తున్నారు. ఇలాంటి రోగాల నియంత్రణకు యోగా ఆరోగ్య ప్రదాయినిగా ఉయోగపడుతున్నది. అందుకే వ్యాయామం, యోగా చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పాలమూరు జిల్లా కేంద్రంలో యోగా శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వయస్సుల వారు యోగాపై అసక్తి చూపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఏకాగ్రత కోసం అందరూ యోగాను ఆశ్రయిస్తున్నారు. ఇంతకు ముందు యోగా చేసే వారిలో ఎక్కువ శాతం వయస్సు పైబడినవారు మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. యువత కూడా యోగా చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆసనాలు వేయడంతో మానసిక ప్రశాంతత కలుగుతుండడంతో జీవితంలో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతామని యువత, వృద్ధులు చెబుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా యోగా చేయొచ్చు. నిరంతరం సూర్య నమస్కారాలు చేయడంతో ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ రోజు సమయాన్ని కేటాయించి యోగా చేస్తే వ్యాధులన్నీ దూరమవడం ఖాయమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

యోగాకు పెరిగిన ఆదరణ

జూన్ 21న యోగా దినోత్సవాని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొంటున్నారు. అంతకు ముందు నుంచి యోగాకు ప్రత్యేకత ఉన్నా.. ఈ మధ్యకాలంలో మరింత ఆదరణ పెరిగిందని చెప్పొచ్చు. ఇన్నాళ్లు కొన్ని వర్గాల వారికే పరిమితమైన యోగా ప్రస్తుతం అన్ని వర్గాలకు చేరుతున్నది. పాలమూరు జిల్లా కేంద్రంతోపాటు ఆయా ప్రాంతాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం యోగా సాధనలో భాగస్వాములు అవుతున్నారు.

అన్ని ప్రధాన ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు

ఇంతకు ముందు కొన్ని సంస్థలు యోగా శిక్షణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగాపై ఆసక్తి పెరుగుతుండడంతో ఇటీవల పాలమూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, బాయ్స్ జూనియర్ కళాశాల మైదానం, బాల కేంద్రంలో యోగా నేర్పుతూ పలువురిని సాధకులుగా తయారు చేస్తున్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో కూడా ప్రత్యే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి కేంద్రానికి శిక్షకులను కేటాయిస్తూ పారితోషికం అందిస్తున్నారు.

రుగ్మతలు దరి చేరవు

మనకు ఎంత పని ఉన్నా నిత్యం యోగాసనాలు తప్పకుండా వేయాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి వ్యాధులు వచ్చినా తట్టుకుని నిలబడే శక్తి లభిస్తుంది. మానసిక ప్రశాంతత కూడా దక్కుతుంది. పిల్లల నుంచి మొదలు వృద్ధుల వరకు యోగాపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం యోగా శిక్షణ అందరికీ అందుబాటులో ఉంటుంది. నిత్యం ఆసనాలు వేయడంతో మనస్సు రిలాక్స్ అవడంతోపాటు వ్యాధులు దూరం కావడం ఖాయం.

- కౌకుంట్ల రమేశ్, యోగా గురువు, పాలమూరు



జాతీయ స్థాయి ప్రతిభ

ఉపకార వేతనాలకు విద్యార్థినులు

- రాష్ట్రం నుంచి 15 మంది ఎంపిక కాగా.. పాలమూరు జేపీఎన్‌సీఈ నుంచే ఏడుగురు
- జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రవికుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 20 : జాతీయ స్థాయి ప్రతిభ పురస్కారం, ఉపకార వేతనాలకు మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం ధర్మాపూర్ సమీపంలోని జయప్రకాశ్ నారాయణ్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఆ కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ శుక్రవారం విద్యార్థినులను అభినందించారు. జాతీయస్థాయిలో ఈ ప్రతిభా వేతనాలకు దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి మొత్తం 130మంది విద్యార్థులు ఎంపిక కాగా తెలంగాణ నుంచి 15మంది విద్యార్థినులు ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్రం నుంచి హిటాచీ గ్రీన్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వారిలో జేపీఎన్‌సీఈ బీటెక్, ట్రిపుల్ ఈ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు సీ పల్లవి, ఏ స్వాతి, ఎన్ శ్రీలత, ఏ పల్లవి, కే గాయత్రి, ఆర్ కావేరి, ఏ శృతి మొత్తం ఏడుగురు ఉండడం ఎంతో సంతోషంగాను, గర్వంగాను భావిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన వారికి హిటాచీ కంపెనీ ఒక్కో విద్యార్థినికి ఒక ల్యాప్‌లాప్‌తో పాటు ప్రతి ఏడాది రూ.20 వేల చొప్పున ఉపకార వేతనం నాలుగేళ్లకు గాను రూ.80వేలు అందిస్తుందన్నారు. ఈ స్కాలర్ షిప్‌లు విద్యార్థినుల ఉన్నతిలో ఆర్థిక ప్రోత్సాహకంగా నిలవనుందన్నారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధన, సిబ్బంది పాల్గొన్నారు.

హిటాచీ గ్రీన్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన జేపీఎన్‌సీఈ విద్యార్థినులు